సాక్షి ఖమ్మం

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



నాటకం.. సజీవ కళారూపం

అద్భుతమైన హావభావాలు, మాటలతో రక్తి కట్టించే కళాకారులు నాటక ప్రదర్శనల ద్వారా కళను బతికిస్తున్నారు. 8లో



విద్యుత్ అంతరాయంతో వెతలు

ఖమ్మం పోస్టాఫీస్‌లోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో విద్యుత్ అంతరాయానికి తోడు జనరేటర్ మొరాయించగా ఇక్కట్లు ఎదురయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం ఎండకు తోడు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎం దృష్టికి సైలోబంకర్ సమస్య



సీఎంతో ఎమ్మెల్యే రాగమయి దంపతులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని సింగరేణి సైలో బంకర్ ద్వారా వెలువడుతున్న కాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని కిష్టారం గ్రామస్తులు తరచుగా ఆందోళనలు చేపడుతున్నారు. ఈనేపథ్యాన హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి – దయానంద్ దంపతులు సమస్యను వివరించి డీఎంఎఫ్‌టీ నిధులపై వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతానని సీఎం హామీ ఇచ్చారని వారు తెలిపారు.

పంట నష్టం నమోదు చేయండి



నేలకొరిన వరి పైరును పరిశీలిస్తున్న డీఏఓ

వైరారూరల్: ఇటీవల అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న తదితర పంటల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. వైరా మండలం పూసలపాడులో మంగళవారం పర్యటించిన ఆయన వర్షాలతో నేలకొరిగిన వరి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే, వివరాల నమోదుపై ఉద్యోగులకు సూచనలు చేశారు. కాగా, ఏఓ మయాన్ మంజూఖాన్ గొల్లపూడిలో పంటలను పరిశీలించగా, అకాల వర్షానికి సుమారు 500 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా ఉందని తెలిపారు. ఏఈఓలు అయిలూరి వాసంతి, బాదావత్ సైదులు, మేడా రాజేష్, వెంకటనర్సయ్య, కీర్తి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపికను పర్యవేక్షించేందుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. ఈమేరకు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం నియోజకవర్గానికి జెడ్పీసీఈఓ దీక్షారైనా, పాలేరుకు ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, మధిరకు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, వైరాకు డివిజనల్ పంచాయతీ అధికారి టి.రాంబాబు, సత్తుపల్లి నియోజకవర్గానికి ఆర్‌డీఓ ఎల్.రాజేందర్‌గౌడ్ ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు.

ఇందిరమ్మ లబ్ధిదారురాలికి తొలి ఫలం

కొణిజర్ల: రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, కొణిజర్ల మండలం చిన్నగోపతి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ గ్రామంలో 52 మందికి గృహాలు మంజూరు చేయగా, వారిలో 43 మంది బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం పూర్తిచేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో నియోజకవర్గానికి ఇద్దరేసి లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చెక్కులు అందజేశారు. ఇందులో చిన్నగోపతికి చెందిన లింగాల నీలిమ కూడా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి చెక్కు అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఇల్లు మంజూరు కావడం, సీఎం చేతుల మీదుగా తొలి విడత చెక్కు అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

ముగిసిన మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఈనెల 7వ తేదీన మొదలైన పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం మంగళవారంతో ముగిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 2,34,456 జవాబుపత్రాలను మూల్యాంకనం చేసినట్లు డీఈఓ సోమశేఖరశర్మ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ తెలిపారు. విధుల్లో వెయ్యి మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారని వెల్లడించారు.

పకడ్బందీగా రేషన్‌కార్డుల సర్వే

చింతకాని: నూతన రేషన్‌కార్డులు, కుటుంబీకుల పేర్లు చేర్చేందుకు అందిన దరఖాస్తుల ఆధారంగా సర్వే పకడ్బందీగా పూర్తిచేయాలని డీఎస్‌ఓ చందన్‌కుమార్ ఆదేశించారు. చింతకానిలో సర్వే మంగళవారం ఆయన పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అర్హులందరికీ కొత్త కార్డులు అందుతాయనే భరోసా కల్పించాలని తెలిపారు. ఆర్‌ఐలు రఘు, జయకృష్ణ పాల్గొన్నారు.

భూసమస్యలకు రాంరాం..

రైతులు ఎదుర్కొనే భూసమస్యలకు ‘భూభారతి’ చట్టం పరిష్కారం చూపించనుంది. ధరణి పోర్టల్‌తో రైతులకు ఎదురైన సమస్యలు, ఇతర అంశాలపై అధ్యయనం చేశాక కొత్త చట్టానికి రూపకల్పన చేశారు. దీని అమలుకు రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా.. అందులో జిల్లాలోని నేలకొండపల్లి మండలానికి స్థానం దక్కింది. ఈమేరకు మంగళవారం ప్రక్రియను తహసీల్దార్ ప్రారంభించి ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటించారు. ఆపై జూన్ 2నుంచి రాష్ట్రమంతా చట్టం అమల్లోకి రానున్నందున సమస్యలు ఉండవని రైతులు భావిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

అమల్లోకి ‘భూభారతి’ చట్టం

- అన్నదాతల బాధలకు చెల్లుచీటీ
- ‘ధరణి’ సమస్యలకు పరిష్కారం.. అప్పీల్‌కూ అవకాశం
- పైలట్ ప్రాజెక్టుగా నేలకొండపల్లి మండలం ఎంపిక

సాంకేతిక సమస్యలతో బేజారు

ధరణి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలతో దరఖాస్తులకు పరిష్కారం లభించలేదు. ఇంకొన్ని సమస్యలు నమోదు చేసే వీలు లేకపోయేది. ప్రధానంగా పీఓబీ(ప్రొహిబిటెడ్ ఆర్డర్ బుక్) సమస్యతో రైతులు సతమతమయ్యారు. పట్టా భూములను కూడా పీఓబీలో చేర్చడంతో భూముల భద్రతపై అనుమానం వ్యక్తమైంది. వీటితోపాటు ఇతర సమస్యలు కూడా ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రతిరోజు రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



3,640 దరఖాస్తులు పెండింగ్..

జిల్లాలో ధరణి సైట్‌ద్వారా పలు సమస్యలపై అందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరిస్తూనే మిగతా సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ధరణిలో మొత్తం 3,640 దరఖాస్తులు రైతుల నుంచి అందాయి. వీటిలో 1,542 దరఖాస్తులు తహసీల్దార్ల వద్ద, 629 దరఖాస్తులు ఆర్డీఓల వద్ద, 841 దరఖాస్తులు అదనపు కలెక్టర్ వద్దే కాక 628 దరఖాస్తులు కలెక్టర్ వద్ద పెండింగ్ ఉన్నాయి.

జూన్ 2 నుంచి పూర్తిస్థాయిలో..

ఈ ఏడాది జూన్ నుంచి భూభారతి చట్టాన్ని పూర్తిగా అమల్లోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో రైతులకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నాలా, మార్పులు, చేర్పులు, అప్పీల్ అండ్ రివిజన్ తదితర సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తుంది. ఇక గ్రామాల్లో నిర్వహించే సదస్సుల్లో రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేస్తారు. అలాగే వారి సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు మార్పులు చేయాలని నిర్ణయించారు. తద్వారా రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామనే నమ్మకం అధికారుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నేలకొండపల్లి మండలంలో భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. ఇందులో భాగంగా ఈనెల 17 నుంచి అవగాహన సదస్సులు నిర్వహించడమే కాక రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. కాగా, ఈ మండలంలో 23 రెవెన్యూ గ్రామాలకు గాను 37,405 ఎకరాల సాగు భూమి ఉంది. సాదాబైనామా కింద అందిన 3,417 దరఖాస్తులు, ధరణిలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని రెవెన్యూ అధికారులు భూభారతి ద్వారా పరిష్కరించనున్నారు.

పరిష్కారం ఇక సులువు

భూభారతి చట్టంతో రైతులకు సంబంధించి సమస్యల పరిష్కారం సులువవుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేశాక అందులో అవసరమైన వాటిని పొందుపరిచారు. రైతులు తహసీల్‌లో అభ్యంతరాలు తెలియజేసే వీలు కూడా కల్పించారు. అయినా న్యాయం జరగపోతే ఆర్డీఓకు, ఆపై కలెక్టర్‌కు అప్పీల్ చేసే వెసులుబాటు ఉంటుంది. గతంలో ధరణి చట్టంలో ఇలాంటి అవకాశం లేక కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేది. కాగా, కొత్త చట్టం ద్వారా ప్రతీ డిసెంబర్‌లో గ్రామ రికార్డులను ముద్రిస్తారు. 2014 జూన్ 2వ తేదీ కన్నా ముందు గ్రామాల్లో వ్యవసాయ భూమిని సాదా బైనామాల ద్వారా కొని అనుభవంలో ఉంటూ 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు క్రమబద్ధీకరణకు అందిన దరఖాస్తులను ఆర్డీఓ విచారించి ధ్రువీకరణ పత్రాలు చేసేలా భూభారతి చట్టం ద్వారా అవకాశం కల్పించారు.

నేలకొండపల్లిలో సంబురాలు..

నేలకొండపల్లి: భూభారతి చట్టం అమలుకు నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంపై కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. స్థానిక తహసీల్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించగా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు స్వీట్లు తినిపించి సన్మానించారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు వజ్జా రమ్య, జెర్రిపోతుల అంజిని, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, వెంకన్న, మైశా శంకర్, బచ్చలకూరి నాగరాజు, బొందయ్య, బోయిన వేణు, రావెళ్ల కృష్ణారావు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, యడవల్లి నాగరాజు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, ముండ్రా నాగప్రసాద్, దోసపాటి శేఖర్, కట్టికోల నాగేశ్వరరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, కొత్తపల్లి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి తహసీల్దార్‌కు స్వీట్ తినిపిస్తున్న నాయకులు

వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

ఖమ్మంమయూరిసెంటర్/మధిర: జిల్లాలోని గిరిజన అభివృద్ధి శాఖ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన మధిరలోని ఎస్టీ జీహెచ్ బాలికల వసతిగృహం, వల్లభిలోని బాలికల వసతిగృహం, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని కళాశాల బాలికల వసతిగృహం, ఖమ్మంరూరల్ పీఎంహెచ్ బాలుర వసతిగృహాలను తనిఖీ చేశారు. మధిర, వల్లభి వసతిగృహాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యాన కొత్త భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఖమ్మంలోని బాలికల వసతిగృహం, ఖమ్మంరూరల్ పీఎంహెచ్ వసతిగృహంలో సౌకర్యాలు మెరుగుపర్చాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పీఓ మాట్లాడుతూ అత్యున్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. ఇందుకోసం కెరీర్ గైడెన్స్ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, మెనూ ప్రకారం భోజనం అందుతోందా, లేదా అని ఆరా తీసిన పీఓ మధిర ఎస్టీజీహెచ్‌లో భోజనం చేశారు. వేసవి సెలవుల్లో పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు చేయించాలని హెచ్‌ఎంలకు సూచించారు. గిరిజన అభివృద్ధి శాఖ డీడీ విజయలక్ష్మి, ఏటీడీఓ సత్యవతి తదితరులు ఉన్నారు.

మోటార్ల కోసం భోపాల్‌కు..

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలంలోని సాగు భూములకు సాగర్ జలాలు అందించేలా రూ.66కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకానికి కావాల్సిన మోటార్ల కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారుడు పెంటారెడ్డి వెంట జిల్లా ఇంజనీర్లు భోపాల్ వెళ్లారు. మోటార్లను యుద్ధప్రాతిపదికన సమకూర్చేలా అక్కడ ఓ కంపెనీ ప్రతినిధులతో చర్చించినట్లు తెలిసింది. ఈ సీజన్‌లోనే సాగర్ జలాలు ఎత్తిపోయాలన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో అధికారులు అదే వేగంతో పనులు చేపడుతున్నారు. మోటార్లు సమకూరితే ట్రయల్ రన్ చేపట్టనుండగా, మే చివరి నాటికి మోటార్లు అందించే ప్రయత్నం చేస్తామని కంపెనీ బాధ్యులు చెప్పినట్లు తెలిసింది.

పిల్లలకు బాసటగా భవిత కేంద్రాలు

ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

ఖమ్మం సహకారనగర్: మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే బాలలకు భవిత కేంద్రాలు బాసటగా నిలవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె భవిత కేంద్రాల ఆధునికీకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎనిమిది భవిత కేంద్రాలు ఉండగా, ప్రత్యేక అవసరాల పిల్లలకు చదువు చెబుతూనే సాధారణ పిల్లలుగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అయితే, భవిత కేంద్రాలను మోడల్‌గా తీర్చిదిద్దే క్రమాన ప్రహరీలు, టాయిలెట్లు నిర్మించడంతో పాటు బెంచీలు, ఇతర ఉపకరణాల కోసం ప్రతిపాదనలు అందించాలని సూచించారు. అలాగే, ఇంటింటా సర్వే ద్వారా వైకల్యంతో బాధపడే పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ కళాశాలల్లో వంద శాతం సీట్లు నిండేలా కృషి చేయాలని సూచించారు. డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్, త్రీమెన్ కమిటీ సభ్యులైన ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ

సాగర్ కాల్వ మరమ్మతులు ప్రారంభం



కాల్వ కోతకు గురైన చోట చేపడుతున్న పనులు

కూసుమంచి: గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదతో పాలేరు రిజర్వాయర్ నుండి జిల్లాలోని ఆయకట్టుకు నీరందించే ఎడమ కాల్వకు భారీ గండ్లు పడ్డాయి. అంతేకాక పలుచోట్ల కోతకు గురికాగా, అప్పటికప్పుడు యూటీ ప్రాంతంలో పడిన గండిని పూడ్చివేసి ఆయకట్టుకు నీరు సరఫరా చేశారు. అలాగే, మత్స్య పరిశోధనా కేంద్రం సమీపాన కాల్వ కట్ట కూడా భారీగా కోతకు గురవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం పంటల సీజన్ ముగియడంతో కాల్వకు నీటి సరఫరా నిలివేసిన నేపథ్యాన కోతకు గురైన చోట్ల పూర్తిస్థాయి మరమ్మతులను మంగళవారం ప్రారంభించారు. వానాకాలం సీజన్ నాటికి పనులన్నీ పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

మినీ హైడల్ ప్రాజెక్టుకు కూడా..

పాలేరు రిజర్వాయర్ ఆధారంగా కొనసాగుతున్న మినీ హైడల్ ప్రాజెక్టుకు నీందందించే కాల్వకు సైతం అప్పట్లో గండి పడగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కాల్వ కట్టలను పటిష్టపర్చడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేసే యూనిట్ల మరమ్మతులను జెన్‌కో నిధులతో ప్రారంభించారు.

ఆర్‌వైవీకి 93,614 దరఖాస్తులు

మూడేళ్ల గడువులో దరఖాస్తుదారులందరికీ యూనిట్లు

ఖమ్మంమయూరిసెంటర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేలా రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం(ఆర్‌వైవీ) పథకానికి అందిన దరఖాస్తుల లెక్క తేలింది. దరఖాస్తు గడువు సోమవారంతో ముగియగా, జిల్లాలో ఎస్సీ, బీసీ, గిరిజన, మైనారిటీ శాఖల ద్వారా 93,614 దరఖాస్తులు అందాయి. ఇందులో ఎస్సీ, బీసీ, గిరిజన శాఖల వారీగా ఈ ఏడాదికి లక్ష్యాలను సైతం కేటాయించగా, మైనార్టీ శాఖకు ఖరారు కావాల్సి ఉంది. దరఖాస్తుల పరిశీలన తర్వాత అర్హులను ఎంపిక చేశాక మూడేళ్లలో లక్ష్యం మేర యూనిట్లను మంజూరు చేయనున్నట్లు సమాచారం.

శాఖల వారీగా ఇలా..

- ఎస్సీ కార్పొరేషన్‌కు 29,748 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ఇండస్ట్రియల్ సర్వీస్ బిజినెస్(ఐఎస్‌బీ)కు 24,982, రవాణా రంగానికి 2,424 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది 7,478యూనిట్లు లక్ష్యం కాగా, రూ.133.42 కోట్లు కేటాయించారు.
- బీసీ అభివృద్ధి శాఖకు 42,591 దరఖాస్తులు అందాయి. జిల్లాకు 5,891 యూనిట్లను లక్ష్యంగా నిర్దేశించగా.. రూ.68.39 కోట్లు కేటాయించారు. ఈబీసీ /ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి 3,416 యూనిట్లు కేటాయించగా.. రూ.39.66 కోట్లు నిధులు వెచ్చించనున్నారు.
- నిరుద్యోగుల నుంచి గిరిజనాభివృద్ధి శాఖకు 14,416 దరఖాస్తులు వచ్చాయి. ఈ శాఖ ద్వారా జిల్లాలో 5,751 యూనిట్లను ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.76.88 కోట్లు కేటాయించగా.. సబ్సిడీ కింద రూ.62.72 కోట్లు, బ్యాంకు రుణం రూ.14.16 కోట్లు ఉంటుంది.
- మైనార్టీ శాఖకు ముస్లింల నుంచి 6,795, క్రిస్టియన్ల నుండి 64 దరఖాస్తులు వచ్చాయి.

క్లుప్తంగా

విద్యుత్ అంతరాయంతో పాస్‌పోర్ట్ కేంద్రంలో వెతలు

ఖమ్మంగాంధీచౌక్: విద్యుత్ అంతరాయంతో ఖమ్మం పోస్టాఫీస్‌లోని పాస్‌పోర్టు కేంద్రానికి మంగళవారం వచ్చిన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయం 10–30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా లేకపోగా, జనరేటర్‌లోనూ బ్యాటరీ సమస్య తలెత్తింది. చివరకు నిపుణులను పిలిపించి బ్యాటరీ సమస్యను పరిష్కరించేసరికి డీజిల్ అయిపోంది. ఇలా స్లాట్ బుకింగ్ చేసుకున్న 95 మందితో పాటు వారికి సహాయంగా వచ్చిన పలువురికి కూర్చునే సౌకర్యం లేక, ఎండలో అవస్థ పడ్డారు. ఈ విషయమై పోస్టుమాస్టర్ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా జనరేటర్‌లో సమస్య తలెత్తడంతో ఆటంకం ఏర్పడిందని తెలిపారు.

ఆలిండియా పోలీస్ క్రీడోత్సవాల్లో ప్రతిభ



పతకం అందుకుంటున్న వెంకట్రావు

ఖమ్మం స్పోర్ట్స్: కేరళ రాష్ట్రం కొచ్చిలో ఈనెల 11నుంచి 15వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా పోలీసు క్రీడోత్సవాల్లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా చైర్మన్, ఏఏస్పీ జి.వెంకట్రావు ప్రతిభ కనబరిచారు. యాభై ఏళ్లు దాటిన పురుషుల సింగిల్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొన్న ఆయన తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించగా తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వెంకట్రావును బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు కర్నాటి వీరభద్రం, వి.చంద్రశేఖర్, పి.రవిమారుత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ జట్టులో వ్యూహిత



వ్యూహితను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రోలర్ స్కేటింగ్ శిక్షణ పొందుతున్న ఇనపనూరి వ్యూహిత రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైంది. అండర్–14 పాఠశాలల విభాగంలో జాతీయ స్థాయి పోటీలు జరగనుండగా, రాష్ట్ర జట్టు తరఫున ఆమె పాల్గొననుంది. ఈ పోటీలు 29నుంచి మే 5వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్నాయి. ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ఆరో తరగతి విద్యార్థి వ్యూహితను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, కోచ్ కె.సురేష్, జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నర్సింహమూర్తి, పాఠశాల హెచ్‌ఎం ఎస్.నక్షత్రం, పీఈటీ ప్రభాకర్ మంగళవారం అభినందించారు.

హోంగార్డు ఆఫీసర్‌కు సన్మానం



వాణిని సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సత్తుపల్లి యూనిట్ హోంగార్డు ఆఫీసర్ మిట్టపల్లి వాణిని మంగళవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సన్మానించారు. కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ వాణి సుదీర్ఘకాలంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించి అధికారుల మన్ననలు పొందారని తెలిపారు. ఆర్‌ఐ ఎం.సురేష్, హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంక శ్రీనుతో పాటు నవీన్‌కుమార్, వెంకటేశ్వర్లు, నీరజ, డి.రమేష్, డి.రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

7,500 గన్నీసంచులు తీసుకెళ్లిన రైతులు

నేలకొండపల్లి: ధాన్యం కాంటాల్లో జాప్యం అవుతుండడం, ఇంకోపక్క ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యాన సొసైటీ కార్యాలయం నుంచి బలవంతంగా గన్నీ సంచులు తీసుకెళ్లిన ఘటన ఇది. నేలకొండపల్లి మండలం రాజారాంపేట పీఏసీఎస్ పరిధి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు దాదాపు 20 రోజులుగా వేచి ఉన్నారు. ఈనేపథ్యాన సొసైటీకి మంగళవారం గన్నీ సంచులు చేరగా, నిర్వాహకులు ఒకేచోట 2వేల బ్యాగ్‌లు దింపినట్లు ప్రచారం జరిగింది. దీంతో కార్యాలయానికి చేరుకున్న రైతులు లారీలో ఉన్న 5వేల సంచులు, సొసైటీలో ఉన్న మరో 2,500 బ్యాగ్‌లను తీసుకెళ్లారు. దీంతో ఎవరెవరు బ్యాగ్‌లు తీసుకెళ్లారు.. ఎలా వెనక్కి తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై సొసైటీ సీఈఓ రామకోటయ్యను వివరణ కోరగా ఎవరికీ తాము 2వేల సంచులు ఇవ్వలేదని, రైతులు బ్యాగ్‌లు తీసుకెళ్లిన అంశంపై చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాటకం.. సజీవ కళారూపం

- ప్రదర్శనలతో చైతన్యం కల్పిస్తున్న కళాకారులు
- జాతీయ స్థాయిలో రాణిస్తున్న మధిర వాసులు

నేడు తెలుగు నాటక రంగ దినోత్సవం



ఓ నాటకంలో శ్రీకృష్ణుడు, ఇతర పాత్రధారులు



ఓ నాటకంలో కళాకారులు

మధిర: ఒకసారి సీన్ సరిగ్గా రాకపోతే మళ్లీ చిత్రీకరించడానికి సినిమా కాదు.. షాట్ విరామంలో దుస్తులు మార్చుకునే వీలుండదు... వందలాది మంది ప్రేక్షకుల కళ్లెదుట వారిని మెప్పించేలా ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం అభినయంలోనే కాదు డైలాగ్‌లు చెప్పడానికీ ఎంతో శ్రమించాలి. మూడు గంటల నాటక ప్రదర్శనకు వేదిక, దుస్తులు, ఆభరణాలకు ఎంతో నగదు వెచ్చించడమే కాక నెలల తరబడి సాధన చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఎందరో కళాకారులు నాటకాలతో జనాన్ని మెప్పిస్తున్నారు... నాటకాలను సజీవ కళారూపాలుగా నిలుపుతున్నారు. అంతేకాదు సినిమాలతో పోలిస్తే వీరు తమ కళారూపాల ద్వారా సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తుండడం విశేషం. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, దర్శకుడు, ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా 2007నుంచి ఏటా ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవం జరుపుకునేలా అప్పటి సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అధికారికంగా ప్రకటించారు.

తెలుగు నాటక గొప్పదనం

నాటకాన్ని ఓ రచయిత రచిస్తే.. దాన్ని ప్రదర్శించడం ద్వారానే సమాజంలోకి వెళ్తుంది. తద్వారా రచయిత, దర్శకుడు, కళాకారులు అంతా కలిస్తే నాటకానికి పరిపూర్ణత లభిస్తుంది. ఇలా కందుకూరి వీరేశలింగం మొదలు గురజాడ అప్పారావు, కాళకూరి నారాయణరావు తదితరులు సామాజిక రుగ్మతలపై ఎన్నో నాటకాలను రూపొందించారు. అప్పటి నుంచి నాటక ప్రదర్శనలో మార్పులు వస్తుండగా.. ఆదరణ తగ్గినప్పటికీ జనహితాన్ని మాత్రం కళాకారులు మరువలేదు.

కళల కాణాచి మధిర

రంగస్థల కళాకారులను ప్రోత్సహించడం, పౌరాణిక, సాంఘిక నాటకాలను బతికించేలా సురభి నాటక సంస్థను 1870లో స్థాపించారు. సుమారు 70ఏళ్ల క్రితం మధిరలో సురభి నాటక సంస్థ బాధ్యులు నాటక ప్రదర్శనలు ఇచ్చారు. వీటికి ప్రభావితమైన స్థానికులు పలువురు నాటక రంగ ప్రదర్శన ప్రారంభించారు. ఇందులో పలువురు తమ నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు సాధించడం విశేషం. అవధానుల వీరాంజనేయ శాస్త్రి, తింటకుర్తి సూరపరాజు, ముదిగొండ విశ్వేశ్వరశాస్త్రి, ఆలేటి కాశియాచారి, గుర్రాల వెంకటేశ్వరరెడ్డి, అవసరాల సత్యనారాయణమూర్తి తదితర ఎందరో కళాకారులు మధిరకు ప్రాశస్త్యం తీసుకొచ్చారు. ఈక్రమంలోనే అనేక కళాపరిషత్‌లను స్థాపించగా.. ఆ సమాజాలతో రంగస్థల కళాకారుల సమాఖ్యగా ఏర్పడింది. కళా ప్రదర్శనల నిర్వహణ, కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా ఈ సమాఖ్య పనిచేస్తోంది.

అవార్డుల పంట

మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన తొలిసారి పాదుకా పట్టాభిషేకం నాటకానికి 2008లో నంది అవార్డు లభించింది. టీటీడీ ఆధ్వర్యాన జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గరుడ అవార్డులు దక్కాయి. విశాఖపట్నంలో సింహాద్రి అవార్డులు, 2022, 2023లో తెనాలిలో కళల కాణాచి సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాదుకా పట్టాభిషేకం, యయాతి నాటక ప్రదర్శనలకు మొదటి బహుమతులు లభించాయి. ఇక్కడి కళాకారులు యయాతి నాటక ప్రదర్శనకు ఎనిమిది అవార్డులు దక్కించుకోవడం విశేషం. సురభి నాటక సంస్థ నేతృత్వాన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఆయన ఆధ్వర్యాన మధిర మధురోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ కళాకారుల అభిరుచి, నైపుణ్యాన్ని గుర్తించిన భట్టి విక్రమార్క మధిరలో సాంస్కృతిక కళా కేంద్రానికి ప్రత్యేకంగా భవనాన్ని సైతం కేటాయించారు.

ఈ తరం దరికి చేర్చాలి



నాటకం తెలుగు వారి సంస్కృతి పరిరక్షణ, జనంలో చైతన్యానికి కారణమవుతోంది. సమాజంలోని సమస్యలను ప్రేక్షకుల దరికి చేర్చడమే నాటకాల గొప్పతనం. అందువల్ల ప్రస్తుత తరానికి ఈ కళను దగ్గర చేస్తే మరికొన్నాళ్లు బతుకుతుంది.

– డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, రచయిత, దర్శకుడు, నటుడు

సంతృప్తిగా పనిచేస్తున్నా...



పండుగల వేళ మా చిన్నాన్న ఇర్మియా నాటకాలు ప్రదర్శించేవారు. ఆయన స్ఫూర్తితోనే ఈ రంగంలోకి వచ్చిన నన్ను సుబ్బరాజు తీర్చిదిద్దగా.. కళారంగంలో సంతృప్తిగా కొనసాగుతున్నా. నేను యయాతి నాటకంలో వేసిన శకుని పాత్రకు జాతీయస్థాయి అవార్డు వచ్చింది.

– ఇనపనూరి వసంత్‌కుమార్, పెద్ద గోపవరం

సామాజిక చైతన్యం..



కళా ప్రదర్శనలతో సమాజంలో చైతన్యం వస్తుంది. అందుకే ఈ కళ అంతరించిపోకుండా పరిరక్షించాలి. నేను రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు, భక్తకన్నప్ప, విష్ణుమూర్తి, శంకరుడు, నారదుడు తదితర పాత్రలు పోషించా. నంది సహా ఎన్నో జాతీయ అవార్డులు వచ్చాయి.

– చిలువేరు శాంతయ్య, మాటూరుపేట

‘రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం’



భీమవరంలో దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు

మధిర/ఎర్రుపాలెం: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఎర్రుపాలెం మండలంలోని భీమవరంలో ఆకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. నష్టం జరిగి రోజులు గడుస్తున్నా ఏ అధికారి రాలేదని రైతులు చెప్పగా, శ్రీధర్‌రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకం అమలుకాకపోవడంతో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు పరిహారం చెల్లించడమే కాక ఎన్నికల నాటి హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆతర్వాత రేమిడిచర్లలో పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. తొలుత, మధిరలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ నాయకుడు తాండ్ర వినోదరావు మాట్లాడుతూ మిర్చి పంట అధికంగా పండించే జిల్లాలో ప్రత్యేక మిర్చి బోర్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మధిరలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి పాటుపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గల్లా సత్యనారాయణ, చావా కిరణ్, ఏలూరి నాగేశ్వరరావు, వేణుగోపాలరెడ్డి, చిలువేరు సాంబశివరావు, కుంచం కృష్ణారావు, శివరాజు సుమంత్, నూతక్క నర్సింహారావు, చిలువేరు సాంబశివరావు, గరికపాటి పురుషోత్తం, రాణాప్రతాప్, నాయిని ప్రసన్న, జంగా నర్సిరెడ్డి, కత్తి రవి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, కొమ్మినేని కృష్ణారావు, మందా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

- కేసీఆర్ హయాంలో రాజులుగా అన్నదాతలు
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



పుల్లయ్యబంజర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు/తల్లాడ: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడమే కాక రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ కల్లూరు మండలం పుల్లయ్యబంజర్‌లోని ధాన్యం కొనగోలు కేంద్రం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఆయన ధర్నా చేశారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో రైతులు నష్టపోతున్నారని, అకాల వర్షాల కారణంగా మద్దతు ధర దక్కే పరిస్థితి లేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు సక్రమంగా అమలుచేయడమే కాక ధాన్యం కొనుగోళ్లతో రైతులను రాజులుగా తీర్చిదిద్దితే, ప్రస్తుత ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇకనైనా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాక, పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని సండ్ర డిమాండ్ చేశారు. అలాగే, జిల్లా మంత్రులు హెలీకాప్టర్లలో తిరగడం ఆపేసి భూమిని నమ్ముకున్న రైతుల కోసం దిగిరావాలని సూచించారు. కాగా, తల్లాడ మండలం గొల్లగూడెంలో కూడా అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సండ్ర పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఏఈఓ, సొసైటీ సీఈఓలతో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు పాలెపు రామారావు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, కూసంపూడి మహేష్, బోబోలు లక్ష్మణరావు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కోడూరి వీరకృష్ణ, పెద్దబోయిన మల్లేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, కాటమనేని వెంకటేశ్వరరావు, ఎస్‌కే.కమ్లి, వాసిని నారాయణరావు, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాల నిలిపివేతతో ఎండుతున్న పొలాలు

కొణిజర్ల: సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల చేయగా.. పాలేరు రిజర్వాయర్ నుంచి సైతం నీటి సరఫరా ఆపేశారు. దీంతో పలుచోట్ల కోతకు వచ్చిన వరి పొలాలు ఎండుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలంలోని బోనకల్ బ్రాంచ్ కాల్వ పరిధి రాపల్లె మేజర్ కింద పెద్దగోపతి, కొండవనమాల, రెడ్డిగూడెంతో పాటు వైరా మండలంలోని పలు గ్రామాలకు సాగు నీరు అందుతోంది. ఈ నెల 10వ తేదీ నుంచి సాగు నీటి విడుదల నిలిపేయడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం వరి పంట గింజ పాలు పోసుకునే స్థితిలో ఉందని, మరో పది రోజులు నీటి తడులు ఇస్తే చేతికందే సమయాన ఇప్పుడు నీరు విడుదల చేయడం సరికాదని వాపోతున్నారు. పెద్దగోపతిలో సుమారు 100 మంది రైతులు 200 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, ఈనెలాఖరు వరకు నీరు విడుదల చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు. ఈమేరకు ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని భట్టి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ మహిళల కోసం ఈనెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. రియన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగావకాశాల కోసం నిర్వహించే ఈ జాబ్‌మేళా ఖమ్మం గాంధీచౌక్‌లోని సంస్థ కార్యాలయంలో జరుగుతుందని పేర్కొన్నారు. 30–45 ఏళ్ల వయస్సు కలిగి, డిగ్రీ ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు.

మానుకోట రోడ్డుకు వనజీవి పేరు..



రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంరూరల్: జీవితాంతం మొక్కలు నాటడం, సంరక్షణకు అంకితం చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య భూమి ఉన్నంతకాలం గుర్తుండిపోతారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలోని రామయ్య చిత్రపటం వద్ద మంగళవారం నివాళులర్పించిన ఆయన కుటుంబీకులను పరామర్శించి మాట్లాడారు. రామయ్య పేరు ఎప్పటికీ గుర్తుండేలా ఖమ్మం – మహబూబాబాద్ రోడ్డుకు ప్రభుత్వం ఆయన పేరు పెట్టాలని కోరారు. అలాగే, ఖమ్మం – రెడ్డిపల్లి మార్గంలో 8 కి.మీ. మేర వనజీవి నాటిన మొక్కలను రోడ్డు విస్తరణలో తొలగించినందున తిరిగి మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

అమెరికాలో జిల్లా వాసి మృతి



వెలగపూడి రమేష్ (ఫైల్)

మధిర: మధిర మండలం ఆత్కూరుకు చెందిన వెలగపూడి రమేష్(47) అమెరికాలో గుండెపోటుతో మృతి చెందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలతో 15ఏళ్లుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఉద్యోగరీత్యా రమేష్ ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడే అనారోగ్యానికి గురై బ్రెయిన్ డెడ్ కాగా, ఆపరేషన్ చేశాక కోలుకునే క్రమంలో గుండెపోటుతో మృతి చెందాడని ఆయన స్నేహితుల ద్వారా తెలిసింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు రమేష్ బంధువులు తానా బాధ్యుల సహకారంతో కృషి చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

నేలకొండపల్లి: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని నాచేపల్లికి చెందిన నల్లగొండ యశ్వంత్(18) ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఆతర్వాత తల్లిదండ్రుల మాట వినకుండా ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతున్నట్లు తెలియగా, వారు మందలించారు. దీంతో బౌద్ధక్షేత్రం వద్ద ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించగా.. తండ్రి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుమలయపాలెం: వరదలు వంటి విపత్తులు ఎదురైనప్పుడు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి సూచించారు. గత ఏడాది భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన మండలంలోని రాకాసితండాను మంగళవారం ఆమె పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన వైద్య శిబిరాలు, సహాయ కార్యక్రమాలపై ఆరా తీసిన డీఎంహెచ్‌ఓ, భవిష్యత్‌లోనూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి పరిసరాల పరిశుభ్రత, గర్భిణుల ఆరోగ్యం, వడదెబ్బ రక్షణపై సూచనలు చేశారు. ఆతర్వాత తిరుమలాయపాలెం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. పీఓ డాక్టర్ రామారావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ లైన్ పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మమత రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా సరఫరా కోసం విద్యుత్ లైన్ వేస్తున్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ పనులను విద్యుత్ శాఖ జీఎం(ఆపరేషన్స్) సురేందర్ మంగళవారం పరిశీలించారు. రోటరీనగర్ సబ్‌స్టేషన్ నుండి మమత సబ్‌స్టేషన్ వరకు ప్రత్యామ్నాయ లైన్ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ పనులు పూర్తయితే ఒక చోట అంతరాయం ఏర్పడినా ఇంకో చోట నుంచి సరఫరాకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. డీఈలు రామారావు, హీరాలాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే డబ్లింగ్ లైన్ భూసేకరణపై దృష్టి

కారేపల్లి: డోర్నకల్ – కొత్తగూడెం నడుమ రైల్వే డబ్లింగ్ లైన్ నిర్మాణానికి అధికారులు భూసేకరణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోనున్న వారితో సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి మంగళవారం సమావేశమయ్యారు. ఇప్పటికే రైల్వే డబ్లింగ్ లైన్ కోసం రైల్వే అధికారులు భూసేకరణ సర్వే పూర్తిచేశారు. ఈ నేపథ్యాన కారేపల్లి మండలంలో ట్రాక్ పక్కన ఉండే పాతకమలాపురం, గంగారంతండా, గేటుకారేపల్లి, కారేపల్లి, కొమ్ముగూడెం, గాంధీపురం, గాదెపాడు, చీమలపాడు, రేలకాయలపల్లి రైతుల భూములు, ఇళ్లు కోల్పోనున్నారు. ఈమేరకు నిర్వాసితులతో సమావేశమైన ఎస్‌డీసీ తగిన న్యాయం చేయనున్నందున భూసేకరణకు సహకరించాలని కోరారు. తొలుత కారేపల్లిలో నిర్వాసిత ప్రాంతాలు, స్టేషన్ ఆమె పరిశీలించారు. సింగరేణి తహసీల్దార్ సంపత్ కుమార్, ఆర్‌ఐ నరసింహారావు, రైల్వే బోర్డు మెంబర్ తురక నారాయణ, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు ఎత్తుకెళ్లిన దుండగులు

- బాధితుడి ఫిర్యాదుతో పట్టుకున్న పోలీసులు

కొణిజర్ల: పొలాల్లో మేస్తున్న గొర్రెలను పక్కదారి పట్టించి వాహనంలో తరలించి అమ్ముకునేందుకు ప్రయత్నించిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాలు... గుబ్బగుర్తికి చెందిన పెద్ద సరవయ్యకు తన గొర్రెలను రోజులాగే సమీపంలోని ఏటి వద్దకు మంగళవారం మేత కోసం తీసుకెళ్లాడు. అయితే, పెద్ద రాంపురం గ్రామానికి చెందిన ఏడుగురు సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలో గెలలు కత్తిరించే క్రమాన 30 గొర్రెలను దారి మళ్లించారు. ఆపై ఓ ట్రాలీ ఆటో మాట్లాడి గొర్రెలను ఏన్కూరులో అప్పగించాలంటూ బయలుదేరగా, ఆలస్యంగా గుర్తించిన సరవయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు తనిఖీ చేస్తూ ఆటోను ఏన్కూరు సమీపాన అడ్డుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ గొర్రెల విలువ రూ.1.90 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

గురుకులాల్లో ఎలుకల బెడద

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు ఎలుకల బెడద తప్పడం లేదు. గతంలో బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిని ఎలుకలు కరవగా గాయాలు కాగా, టేకులపల్లి ఎస్సీ సంక్షేమశాఖ గురుకులంలోనూ ఇలాంటి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం క్రితం ఆరుగురు విద్యార్థినులను ఎలుకలు కొరకడంతో వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. గురుకులం చుట్టు అపరిశుభ్రత వాతావరణం కారణంగా ఎలుకలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. అంతేకాక నాలుగు రోజులుగా మోటార్ పని చేయక నీటి కోసం విద్యార్థినులు ఇబ్బంది పడడంతో మంగళవారం మరమ్మతు చేయించారని సమాచారం. సంక్షేమ గురుకులాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. కాగా, టేకులపల్లి గురుకులంలో ఘటనపై అధికారులను వివరణ కోరగా.. ఆరుగురు విద్యార్థినులను ఎలుగకలు గాయపర్చగా వారికి టీకాలు వేయించడంతో పాటు ఆవరణలో శుభ్రం చేయించినట్లు తెలిపారు.

ఇద్దరు తహసీల్దార్లు.. 23 గ్రామాలు

‘భూభారతి’ సదస్సుల షెడ్యూల్ ఖరారు

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలుకు జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో గురువారం(17వ తేదీ) నుంచి 30వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకోసం మండల తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లుతో పాటు మరో తహసీల్దార్ స్థాయి అధికారి తఫజుల్ హుస్సేన్ నేతృత్వాన రెండు బృందాలను ఏర్పాటుచేశారు. ఒక్కో బృందంలో ఆర్‌ఐ, సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు మరో ఉద్యోగి ఉంటారు. ఈ బృందాలు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తూ రైతులకు కొత్త చట్టంపై అవగాహన కల్పించడమే కాక సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈమేరకు తొలిరోజైన 17వ తేదీన చెరువుమాదారంలో, 19న భైరవునిపల్లి, నేలకొండపల్లి, 21న బుద్ధారం, బోదులబండ, 22న కట్టుకాచారం, చందాపురం, 23న కొంగర, చెన్నారం, 24న నాచేపల్లి, గువ్వలగూడెం, 25న పైనంపల్లి, ముండ్రాజుపల్లి, 26న రామచంద్రాపురం, ముజ్జుగూడెం, 28న అన్నసాగారం, రాజేశ్వరపురం, 29న ఆరెగూడెం, సింగారెడ్డిపాలెం, 30న కోనాయిగూడెం, ఆచార్లగూడెం, సుర్దేపల్లి, తిరుమలాపురంల్లో జరిగే సదస్సులకు తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజుల్ హుస్సేన్ నేతృత్వం వహించనున్నారు.